## బాధితులను ఆదుకునేందుకు ముందుకు రండి: సీఎం

అమరావతి,సెప్టెంబర్3 : వరద బాధితులను ఆదుకునేందుకు ప్రజలు స్వచ్ఛంధంగా ముందుకు రావాలని ఏపీ ప్రభుత్వం పిలుపునిచ్చింది. బాధితులకు ఏ రూపంలోనైనా సాయం అందించాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు కోరారు. స్వచ్ఛందంగా ఆహారం ఇవ్వదలచిన దాతల కొసం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏపీ ప్రభుత్వం ప్రత్యేక పాయింట్ ఏర్పాటు చేసింది. ఆహారం అందించే దాతలను కో-ఆర్డినేట్ చేసుకునే బాధ్యతను ఐఏఎస్ మనజీర్‌కు అప్పగించింది. స్వచ్ఛంధంగా ముందుకు వచ్చే దాతలకు మరింత సమాచారం అందించేందుకు 79067 96105 నెంబర్‌లో సంప్రదించాలని కోరింది.


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి బుధవారం 04-09-2024 సంపుటి : 06 సంచిక : 346 పేజీలు : 8 వెల : రూ 3-00


# అధికారుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదు


**మంత్రులైనా సహాయక చర్యల్లో పాల్గొనాల్సిందే**
**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు**
**కఠినంగా హెచ్చరించిన చంద్రబాబు నాయుడు**



విజయవాడ,సెప్టెంబర్3 : వరద బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలూ చేపట్టామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. కొన్ని చోట్ల ఆహారం అందలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విజయవాడ కలెక్టరేట్ వద్ద మీడియాతో సీఎం మాట్లాడారు. నగరంలో డివిజన్‌కు ఒక సీనియర్ ఐఏఎస్‌ను నియమించామని చెప్పారు. 32 మంది ఐఏఎస్ అధికారులు సహాయక చర్యల్లో ఉన్నారన్నారు. పది జిల్లాల నుంచి ఆహారం సమకూర్చామని.. బాధితులకు మూడు పూటలా అందించాలని ఆదేశించినట్లు చెప్పారు. చిట్టచివరి బాధితుడికి కూడా సాయం అందాలని స్పష్టం చేశారు. వరదలతో పేదల బాధలు వర్ణణాతీతం. కొన్ని ఇళ్లల్లోకి పాములు, తేళ్లు వచ్చాయి. దీంతో వారందరికీ బాధ, భయం ఉంటుంది. అధికారులంతా మానవతా దృక్పథంతో పనిచేయాలి. అందుతున్న సహాయంపై ఐవీఆర్‌ఎస్ నిర్వహిస్తున్నాం. కొన్ని ప్రాంతాలకు ఇంకా ఆహారం అందలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ఆహారం అందని బాధితుల నంబర్లు అధికారులకు పంపిస్తున్నాం. ఇబ్బందులపై ప్రజలు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలి. నేను కూడా ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నా. అధికారులకు రెండు రోజులుగా చెప్పాం.. ఇప్పుడు సరిగా పనిచేయలేదని ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవు. మీనమేషాలు లెక్కించడం సరికాదు.. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు సర్వశక్తులూ ఒడ్డి సేవ చేయాలి. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నా. ఈ కష్ట సమయంలో బాధితులకు అండగా నిలవాలి. ఏవిధంగా సహకారం అందించగలిగితే అలా చేయూత అందించాలి. ఆర్థికంగా, నిత్యావసరాలు, సహాయ కార్యక్రమాల్లో పాల్గొనడం.. ఇలా ఏది వీలైతే అది మీ శక్తిమేర చేయాలి. ప్రభుత్వం తరఫున చేయాల్సిందంతా చేస్తాం. రెండు రోజు వరద ప్రభావిత ప్రాంతాల్లో చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రులు, అధికారులకు గట్టిగా హెచ్చరిక ఇచ్చారు. విపత్తు నిర్వహణలో సరిగ్గా పని చేయకుంటే, మంత్రులకైనా వేటు తప్పదని హెచ్చరిస్తున్నానని చంద్రబాబు తెలిపారు. జక్కంపూడిలో విధులు సరిగా నిర్వర్తించని ఓ అధికారిని ఇప్పటికే సస్పెండ్ చేశానన్నారు. వీఆర్‌లో పెట్టిన అధికారులు విపత్తు నిర్వహణ బాధ్యతల్లో సక్రమంగా విధులు నిర్వర్తించ లేదనే ఫిర్యాదులు ఉన్నాయన్నారు. దీనిపైనా విచారణ జరిపిస్తున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో వివాదాస్పద అధికారులకు బాధ్యతలు అప్పగింత మంచి ఉద్దేశంతో జరిగిందా? లేక ఓవర్ లుక్‌లో అయిందా? అనేది పరిశీలిస్తున్నామని చంద్రబాబు తెలిపారు.ఏ రకంగా బాధ్యతలు అప్పగించినా పని చేయాలనే మానవత్వం సదరు అధికారులకు ఉండదా? అని ప్రశ్నించారు. టోల్ ఫ్రీ నంబర్‌లు పనిచేయట్లేదనే ఫిర్యాదు ను అంగీకరిస్తున్నానని చంద్రబాబు తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థ 5ఏళ్లుగా పక్షవాతం వచ్చినట్లుగా పడి ఉందని ఒకింత అసహనం వ్యక్తం చేశారు. కొత్త కంట్రోల్ రూమ్ వ్యవస్థ పెట్టి వెంటనే సమస్య పరిష్కరిస్తా నన్నారు. బ్యారేజీ వద్దకు బోట్లు ఎలా కొట్టుకొచ్చాయని విచారణ జరిపిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. తప్పుడు వార్తలు ఇచ్చి ఓ వర్గం మీడియా ఇంకా పరువు పోగొట్టుకోవద్దని హెచ్చరించారు. ఉదయం నుంచి జరిగిన ఆహారం పంపిణీ వివరాలను సీఎం చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా విధుల్లో ఉన్న అధికారులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. 5 హెలీకాప్టర్ల ద్వారా ఆహార పంపిణీ జరుగు తోందని సీఎంకు అధికారులు తెలిపారు. హెలికాప్టర్, పడవలు, ట్రాక్టర్ల ద్వారా ఉదయం నుంచి ఆహారం, నీళ్ళు అందిస్తున్నామని వివరించారు. 5 లక్షల ఆహారం, నీళ్ళ ప్యాకెట్లు సిద్ధం చేసి పంపిణీ చేశామని చంద్రబాబుకు అధికారులు తెలిపారు.100 శాతం ఆహారం పంపిణీ జరగాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు.

# వరదబాధితులకు ఆహారం, నీరు

**నిరంతరంగా శ్రమిస్తున్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు**
**సహాయక చర్యలపై చంద్రబాబు పర్యవేక్షణ**



విజయవాడ,సెప్టెంబర్3 ): విజయవాడను పెద్ద ఎత్తున వరద ముంచెత్తడంతో.. ఏకంగా సీఎం చంద్రబాబు సహా మంత్రులు, అధికారులు అంతా విజయవాడలోనే తిష్ట వేసి మరీ వరద సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. బాధితులకు ఎప్పటికప్పుడు ధైర్యం చెబుతున్నారు. బాధితులకు మూడు పూటలా భోజనంతో పాటు వాటర్ సదుపాయం కల్పిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దింపి మరీ సహాయక చర్యలు బాధితులకు అందేలా చూస్తున్నారు. విపత్తు సమయంలో సరిగా పని చేయకుంటే ఎవ్వరినీ వదలబోనని సీఎం చంద్రబాబు తెలిపారు. మరోవైపు మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణలో విజయవాడ వరద బాధితులకు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మంగళవారం సహాయక చర్యల్లో ఆరు హెలికాప్టర్లు ద్వారా ఆహారం, తాగు నీటిని సరఫరా చేశారు. బోట్లు చేరుకోలేని ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా ఆహార సరఫరా చేస్తున్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ విజ్ఞప్తి మేరకు జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీకి ప్రత్యేక హెలికాప్టర్‌లో 2,500 ఆహార పొట్లాలను చేరవేస్తున్నారు. విజయవాడ పరిధిలో వరద ముంపునకు గురైన 32 వార్డుల్లో సీనియర్ ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మంత్రి లోకేష్ పిలుపు మేరకు సహాయ చర్యల్లో రాష్ట్రం నలుమూలల నుంచి విజయవాడకు పార్టీ శ్రేణులు చేరుకున్నాయి. విజయవాడ డివిజన్ పరిధిలో 70 పునరావాస కేంద్రాల్లో 14,452 మంది నిరాశ్రయులు ఆశ్రయం పొందుతున్నారు. ప్రకాశం బ్యారేజి వద్ద వేగంగా వరద తగ్గుముఖం పడుతోంది. ప్రస్తుత వరద ప్రవాహం 8,71,776 క్యూసెక్కులకు చేరుకుంది. మరోవైపు రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద పరిస్థితులు, బాధితులకు అందుతున్న ఆహారం గురించి ఆరా తీశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తు న్నారు. తాగునీరు, ఆహారం ప్రతి ఒక్కరికి చేరాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న సహాయక చర్యల్లో కార్యకర్తలు పాల్గొనాలని సూచించారు. ఇప్పటికే మచిలీపట్నం నుంచి విజయవాడకు టీడీపీ కార్యకర్తలు చేరుకున్నారు. బాధితులకు అండగా నిలవాలని, కల్పించాలని కార్యకర్తలందరికీ కొల్లు రవీంద్ర సూచించారు.

## బాలకృష్ణ వరదసాయం కోటి

**సిఎంల సహాయ నిధికి అందిస్తానని ప్రకటన**



విజయవాడ,సెప్టెంబర్3(ఆర్ఎన్ఎ): రెండు తెలుగు రాష్ట్రాలను వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. ముఖ్యంగా ఏపీలోని విజయవాడ, తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలు పూర్తిగా నీట మునిగాయి. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. రంగంలోకి దిగిన అధికారులు వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అనేక మంది ప్రజలు ఇళ్లను కోల్పోయి నిరాశ్రయులయ్యారు. ఈ క్రమంలో వరద బాధితులను ఆదుకునేందుకు పలువురు సినీ తారలు, రాజకీయ ప్రముఖులు ముందుకు వస్తున్నారు. తమ వంతు సాయంగా ముఖ్యమంత్రి

# సజ్జన్ జిందాల్ కోసం జత్వానీకి వేధింపులు



**ఫోర్జరీ సంతకం కోసమే అధికార దుర్వినియోగం**
**కాదంబరి జత్వానీని వేధించడం రాక్షసత్వం**
**కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల విమర్శలు**

కడప,సెప్టెంబర్3 కేంద్రంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం కడప స్టీల్‌ప్లాంట్‌పై ఏమాత్రం స్పందన లేకుండా వ్యవహరిస్తోందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తిచేయాలని వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్‌కు ఆమె వినతిపత్రం అందజేశారు. మాజీ సీఎం జగన్ గత ఏడాది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన చేసినా దాని గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. పరిశ్రమ ఏర్పాటుపై కాంగ్రెస్ తరఫున పోరాటం చేస్తామని చెప్పారు. ముంబయి నటి కాదంబరి జత్వానీ వ్యవహారంపైనా షర్మిల స్పందించారు. ఈ విషయంలో జగన్‌పై పలు విమర్శలు చేశారు. ఆమెను ఎలా కట్టడి చేయాలో జగన్, సజ్జన్ జిందాల్ ప్లాన్ చేశారని ఆరోపించారు. సజ్జన్ జిందాల్, జగన్ మధ్య సాన్నిహిత్యాన్ని గొప్పగా చెప్పుకొన్నారు. జిందాల్‌కు ఎందుకు ఇన్ని కోట్లరూపాయల ఆస్తి కట్టబెట్టారో జగన్ సమాధానం చెప్పాలని అన్నారు. సజ్జన్ జిందాల్ గతంలో పదేపదే జగన్‌ను కలుస్తూంటే స్టీల్ ఫ్యాక్టరీ కోసం అనుకున్నామని కానీ వెనుక హీరోయిన్ కాదంబరి జెత్వానీని టార్గెట్ చేసి వేధించే కుట్ర ఉందని తెలిసిన తర్వాత ఆశ్చర్య పోవాల్సి వచ్చిందని ఏపీ పీసీసీ చీఫ్ షర్మిలారెడ్డి వ్యాఖ్యానించారు. కడప జిల్లా కలెక్టర్ ను ఆమె కలిశారు. స్టీల్ ప్లాంట్ పురోగతిపై మాట్లాడారు . ఆ తర్వాత మీడియా తో మాట్లాడిన సందర్భంగా జగన్ పై విమర్శలు గుప్పించారు. జిందాల్ కంపెనీ ప్రాజెక్ట్ నిర్మాణంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు కానీ.. పదే పదే తాడేపల్లి ప్యాలెస్ లో సజ్జన్ జిందాల్ కలుస్తుంటే కడప స్టీల్ వేగవంతం చేస్తున్నారు అనుకున్నామన్నారు. కాని ఒక మహిళా కాదంబరి విషయం బయట పడేసరికి ఇందుకా.. అని ఆశ్చర్య పోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇది మామూలు మాస్టర్ ఎ÷-లాన్ కాదని షర్మిల మండిపడ్డారు. ఆడదాన్ని ఒక్క దాన్ని చేసి తొక్కాలని చూశారని విమర్శించారు. జె అండ్ జె ఇద్దరు కలిసి బుర్రకు పదనును పెట్టి.. జె స్వేర్ కలిసి కార్యాచరణ చేశారన్నారు. మీ బుర్రలు కడప స్టీల్ మీద పెట్టి ఉంటే ప్రాజెక్ట్ ఎప్పుడో పూర్తి అయ్యేదన్నారు. సజ్జన్ జిందాల్ గతంలోనే జగన్ గురించి చెప్పారని.. ఇద్దరు మంచి దోస్త్ లు అని చెప్పాడని గుర్తు చేశారు. రాష్ట్రానికి జిందాల్ ఏమి చేశాడని వేల ఎకరాలు భూములు కట్ట బెట్టారో చెప్పాలని జగన్‌ని ప్రశ్నించారు. జిందాల్ కి 3500 ఎకరాలు అప్పగిస్తే ఎందుకు పనులు ప్రారంభించలేదని ప్రస్నించారు. జెత్వాని ఒక డాక్టర్. ఆమె ఒక నటి .. ఒక గొప్పకుటుంబం నుంచి వచ్చారన్నారు. ఆమె ఒక కేసు పెడితే .. ఆమెను తొక్కాలని చూశారని.. నిజంగా కాదంబరి మోసం చేయాలని చూస్తే జిందాల్ ఒక 50 లేదా 100 కోట్లు ఇచ్చి సెటిల్మెంట్ చేసుకోనే వాడు కదా అని ప్రశ్నించారు. ఆమె న్యాయం కావాలని నిలబడిందన్నారు.

## వరద పరిస్థితులపై మాజీ సిఎం జగన్ సమీక్ష

**పార్టీ పరంగా కోటి విరాళం ప్రకటన**

అమరావతి,సెప్టెంబర్3 కృష్ణా నదికి భారీ వరదలతో విజయవాడలో తలెత్తిన పరిస్థితిపై మాజీ సీఎం, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ నాయకులతో సమీక్షించారు. వరద బాధితుల కోసం పార్టీ తరపున కోటి రూపాయల సాయం ప్రకటిస్తున్నట్లు వైసీపీ అధినేత జగన్ వెల్లడించారు. అది ఏ రూపంలో, ఎలా ఇవ్వాలనేది పార్టీ నాయకులతో చర్చించి, నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వరద ముంచెత్తిన ప్రాంతాల్లో ప్రభుత్వం ఎలాంటి సహాయ కార్యక్రమాలు చేపట్టడం లేదని, లక్షలాది మంది కనీసం ఆహారం, మంచినీరు కూడా దొరక్క నానా ఇబ్బంది పడుతున్నారని సమావేశంలో పలువురు నాయకులు జగన్ కు తెలిపారు. వరద ప్రాంతాల్లో షో చేస్తూ, ఫోటోలకు ఫోజులు ఇస్తూ, సీఎం చంద్రబాబు పర్యటిస్తున్నారని, అధికార యంత్రాంగమంతా ఆయనతో ఉంటూ, ప్రజల సమస్యలను గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. దీంతో వరద బాధితులు అనారోగ్యం పాలవుతున్నా, వారికి మందులు కూడా లభించడం లేదని, చివరకు పాలు కూడా దొరక్క తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. వరద బాధితుల పడుతున్న కష్టాలను స్వయంగా చూశానన్న వైయస్ జగన్... వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని తెలిపారు.

కూటమి ప్రభుత్వం ఘోర తప్పిదం వల్లనే ఈ ఘటన చోటు చేసుకుందని,

# బుడమేరు పాపం వైకాపాదే

**ఇసుక తవ్వకాలతోనే వరద ముంపు**
**టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విమర్శలు**
**బుడమేరు శాంతించడంతో మరమ్మత్తులకు దిగిన అధికారులు**

అమరావతి,సెప్టెంబర్3 వైసీపీ నేతల అక్రమ ఇసుక దందా వలనే బుడమేరుకు గండ్లు పడి కోతకు గురైందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు యాదవ్ విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత ఐదేళ్లు బుడమేరును గాలికొదిలేసిన జగన్.. నేడు ప్రభుత్వంపై బురద చల్లేందుకు వచ్చాడని మండిపడ్డారు. విపత్తుల సమయంలో జగన్ ఏనాడు బాధితుల పక్షాన నిలబడలేదన్నారు. ఐదేళ్ల పదవీకాలంలో సాయంత్రం 5 తరువాత ఒక్క రోజు కూడా జగన్ బయటకు రాలేదన్నారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ప్రజాహితం కోరాలని తెలిపారు. జగన్ రెడ్డి ఫేక్ ప్రచారం మానుకోవాలని... విమర్శలు నిర్మాణాత్మకంగా ఉండాలన్నారు. చంద్రబాబు ఇంటి కోసం బుడమేరు నీరు డైవర్ట్ చేశారని చెప్పడం జగన్ తెలివితక్కువతనానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద బాధితుల కోసం నిలబడిన భగీరదుడు చంద్రబాబు అని అన్నారు. బాధితుల కోసం యంత్రాంగాన్ని, నేతలను, హెలికాప్టర్లు, బోట్లు, డ్రోన్లతో యుద్ధప్రాతిపదికన సాహాయ సహకారాలను అందించడం చంద్రబాబు వలనే సాధ్యమైందన్నారు. అమరావతిపై తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణం చేయడంలో చంద్రబాబు పాత్ర కీలకం కానుందని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మరోవైపు... 48 గంటలుగా మహోగ్రరూపం దాల్చిన బుడమేరు కాస్త శాంతించింది. దీంతో బుడమేరులో గండి పడిన ప్రాంతాన్ని పూడ్చేందుకు ఇరిగేషన్ అధికారులు సిద్ధమయ్యారు.

# వరదబాధితులను ముంపు నుంచి తరలించాం

**8.5లక్షల మందికి టిఫిన్ ప్యాకెట్లు, అన్నం ప్యాకెట్లు పంపిణీ**
**పారిశుధ్యం సాధారణ స్థితికి తీసుకురావడానికి 10వేలమంది అవసరం**
**మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ వెల్లడి**

అమరావతి,సెప్టెంబర్3 వరద ముంపు ప్రాంతాల్లో ఎంతో కష్టపడి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించామని పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. బాధితులందరికీ ఆహారం అందేలా ఏర్పాట్లు చేశామన్నారు. వరద సహాయక చర్యలపై ఆయన మీడియాతో మాట్లాడారు. మంగళవారం 8.5లక్షల టిఫిన్ ప్యాకెట్లు, 8.5లక్షల అన్నం ప్యాకెట్లు పంపిణీ చేశాం. 5 లక్షల వాటర్ బాటిల్స్ బాధితులకు అందించాం. వరద నీరు తగ్గిన తర్వాత రోడ్లపై మురుగు లేకుండా పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టాం. ముంపు ప్రాంతాల్లో పారిశుధ్యం సాధారణ స్థితికి తీసుకురావడానికి 10వేల మంది కార్మికులు అవసరమవుతారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 123 మున్సిపాలిటీల కమిషనర్లకు వరద ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాం. ఒక్కో సచివాలయానికి ఒక్కో ప్రత్యేకాధికారి ఉంటారు. వరద నీరు తగ్గగానే అగ్నిమాపకశాఖతో కలిసి ట్యాంకర్ల ద్వారా రోడ్లను శుభ్రం చేస్తాం. బ్లీచింగ్, ఫాగింగ్ పనులు చేపడతాం, వైద్యారోగ్య శాఖతో కలిసి మెడికల్ క్యాంపులు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. విజయవాడను మూడు మార్గాల్లో వరద నీరు చుట్టుముట్టిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. కృష్ణానదితో పాటు బుడమేరు, మున్నేరు నుంచి ఒకేసారి వరద రావడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తాయని చెప్పారు. జనజీవనం సాధారణ స్థితికి వచ్చే వరకు ప్రభుత్వం విశ్రమించదన్నారు. ఎక్కడా విద్యుత్ కొరత లేదని, వరద ఉన్న చోట్ల విద్యుత్ పునరుద్ధరిస్తే ప్రాణాపాయమనే.. ముందుజాగ్రత్త చర్యగా విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వచ్చిందని తెలిపారు.

# సంపాదకీయం

బుధవారం 04-09-2024

## జలవిలయాల ప్రభావం తగ్గించలేమా

సరిగ్గా నెల రోజుల క్రితం? జులై 30 కేరళలో వయనాడ్‌లో ఆకాశం బద్దలైంది. కొండలు కూలిపోయాయి. ఊళ్లు నామరూపాలు లేకుండా పోయాయి. 392 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికీ ఏ రోజుకారోజు కేరళ వరదలు సృష్టించిన విధ్వంసం తాలుకూ చేదు జ్ఞాపకాలు ఏదో ఒక రూపంలో స్థానికుల్ని వెంటాడుతునే ఉన్నాయి. నిలువ నీడ లేకుండా మిగిలిన పోయిన కుటుంబాల ఇప్పట్లో తేరుకునేలా కనిపించండ లేదు. యావత్ దేశం కేరళను ఆదుకునేందుకు ముందుకొచ్చింది.ఆగస్ట్ 2024 వర్షాలు స్టిల్ కంటిన్యూ? అయినా వర్షాకాలం వర్షాలు కాక.. ఎండలు కాస్తాయా అన్న వాళ్లు లేకపోలేదు. కానీ ఈ వర్షాలు వర్షాకాలం వర్షాల్లా కురిస్తే.. మనం ఇంత ఘనం మాట్లాడుకోవాల్సిన పని లేదు. మహారాష్ట్రను ముంచేసింది. ముంబై మహానగరం కూడా వర్షాలకు అల్లాడిపోక తప్పలేదు. ఆ పై గుజరాత్‌ను గజగజలాడించాయి. ఇప్పటికే మూడు పదలుకుపైగా ప్రాణాలు పోయాయి. సుమారు 20 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.ఇక తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే ఈ ఏడాది నైరుతి ముందే వచ్చినా వర్షాలు ఆలస్యమయ్యాయి. జూలై 3-4 వారాల వరకు పెద్దగా వర్షాల జాడే లేదు. ఎగువన కర్నాటక, మహారాష్ట్రాలలో కురిసిన వర్షాల ధాటికి క్రమంగా ప్రాజెక్టులు నిండటం మొదలైంది. ఆపై తెలుగు రాష్ట్రాల్లోనూ వరణుడు కరుణించడంతో నాలుగైదు రోజుల క్రితం వరకు అన్ని ప్రాజెక్టులు కళకళలాడుతూ కనిపించాయి. ఆగస్టు కూడా ముగిసి సెప్టెంబర్ వస్తూ ఉండటంతో.. ఈ ఏడాదికిక వర్షాలు సరిపోతాయనుకున్నారంతా.. బట్?జూలై 30 కేరళను అతలాకుతలం చేసేస్తే? సరిగ్గా నెల రోజుల్లో అంటే ఆగస్టు 30-31 తెలుగు రాష్ట్రాలను ముంచేశాడు వరుణుడు. ఇప్పటికి ఎన్ని సార్లు వాయుగుండాలు రాలేదు.. అయినా.. ఈ వాయుగుండం సృష్టించినంత విలయం బహశా.. గడిచిన కొన్నేళ్లలో ఎప్పుడూ జరగలేదేమో.. ఎక్కడో ఉత్తరాంధ్రలో కళింగపట్నం దగ్గర తీరం దాటిన వాయుగుండం కృష్ణా, గుంటూరు, ఖమ్మం, నల్గొండ జిల్లాలలో ఇంత బీభత్సం సృష్టిస్తుందని ఎవ్వరూ ఊహించి ఉండరు. నిజానికి వాయుగుండం తీరం దాటిన శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం ప్రాంతంలో మాములూ వర్షమే పడింది. పెద్దగా ఈదురు గాలులు కూడా లేవు. దీంతో అక్కడ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కానీ అంతంత మాత్రం ప్రభావం ఉంటుందనుకున్న కృష్ణా-గుంటూరు, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లోనూ ఇటు తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో మాత్రం రికార్డు స్థాయి వర్షాలు నమోదయ్యాయి వాయుగుండం తీరం దాటిన ప్రాంతంలోనే దాని ప్రభావం ఉంటే.. ఈ స్థాయిలో ఆస్తినష్టం సంభవించి ఉండేది కాదు. ఎందుకంటే తీరం దాటిన ప్రాంతంలో విజయవాడ నగరం.. దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉండేంత జన సాంద్రత ఉండదు. ఇళ్లు, భవనాలు కూడా ఉండవు. పైగా ఆ ప్రాంతంలో ఉన్నవన్నీ గ్రామాలే. కానీ వాస్తవం వేరుగా ఉంది.విజయవాడ-గుంటూరు-ఖమ్మం-నల్గొండ.. ఈ ప్రాంతాల్లోనే కాదు.కానీ రెండు రాష్ట్రాల్లోని ఆ నాలుగు జిల్లాల్లో ఉన్న ప్రభావం తెలంగాణలోని మిగిలిన జిల్లాల్లో లేదు. అటు ఏపీలోని విజయవాడ-గుంటూరు, ఇటు తెలంగాణలో ఖమ్మం-నల్గొండ.. ఈ నాలుగు జిల్లాలు తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న జిల్లాలు. అలాగే హైదరాబాద్ మహానగరాన్ని ఏపీతో కలిపే జిల్లాలు. దీంతో ఆ నాలుగు జిల్లాల్లో కురిసిన వర్షాలు, అక్కడ సంభవించిన వరదల వల్ల ప్రభావితమైన ప్రజల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. ఖమ్మం, నల్గొండలో కురిసిన వర్షాల ధాటికి విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారులు నీటి మునిగాయి. దీంతో రాకపోకలకు బ్రేక్ పడింది. కేవలం విజయవాడ-హైదరాబాద్ రోజుకి సుమారు 24వేల వాహనాలు తిరుగుతాయి. దీంతో గడిచిన 24 గంటలుగా అక్కడ రాకపోకలు స్తంభించడంతో రెండు రాష్ట్రాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటు రైల్వే లైన్లు కూడా దెబ్బతినడంతో విజయవాడ మీదుగా నడిచే 130 రైళ్లను రద్దు చేశారు. విజయవాడ-హైదరాబాద్‌ల మధ్య కె సముద్రం వద్ద రైల్వేట్రాక్ దెబ్బతినడంతో చాలా రైళ్లపై ప్రభావం పడింది.ఏపీలో విజయవాడ పరిస్థితి అలా ఉంటే.. తెలంగాణ రాష్ట్రానికొస్తే.. ఇక్కడ ఖమ్మం జిల్లాపై ఆ స్థాయిలో ప్రభావం పడిందని చెప్పొచ్చు. శనివారం రాత్రి ఖమ్మం నగరంలో కురిసిన వర్షం ధాటికి జనం అల్లాడిపోయారు. చాలా ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు చేరింది. దానికి తోడు మున్నేరు వాగు పొంగడంతో కట్టుబట్టలతో జనం మిగిలిపోయిన పరిస్థితి నెలకొంది. ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సెల్ టవర్లు పని చెయ్యలేదు. కొన్ని ప్రాంతాల్లో ఊరేదో.. చెరువేదో.. నది ఏదో కూడా తెలుసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఖమ్మం-హైదరాబాద్ జాతీయ రహదారి కొట్టుకుపోయింది. పాలేరు వరద ఉధృతికి కూసుమంచి దగ్గర హైవే ధ్వంసమైంది. మంత్రి పొంగులేటి నియోజకవర్గంలో చాలా ప్రాంతాల్లో వరదలో చిక్కుకున్నాయి. జనం కట్టుబట్టలతో మిగిలిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. భద్రచాలం వద్ద గోదావరికి గతంలో సెప్టెంబర్ నెలలో కూడా వరదలు ముంచెత్తిన చరిత్ర ఉండటంతో స్థానికులు భయం భయంగా కాలం గడుపుతున్నారు.జులై-ఆగస్టు.. రెండు నెలలు కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు తీరని వ్యధను మిగిల్చాయి. మరి సెప్టెంబర్ సంగతేంటి..? ఈ నెలలో పరిస్థితి ఎలా ఉండబోతోంది..? గడిచిన 2 నెలలు చూసిన తర్వాత సహజంగానే అందరి దృష్టి ఈనెలపైనే ఉంది. గడిచిన ఐదేళ్లలో సెప్టెంబర్లోను తుపానులు బీభత్సం సృష్టించాయి.

## వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్ : హరీశ్‌రావు



ఖమ్మం : ఖమ్మం జిల్లాలో వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.గత మూడు నాలుగు రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు ఖమ్మం జిల్లాలో తీవ్రమైన నష్టం జరిగింది. సూర్యాపేట, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాల వల్ల జనజీనవం అతలాకులతమైంది. భారీగా ప్రాణ, ఆస్తి, పంట నష్టం జరిగింది. వరదల విషయంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం సకాలంలో స్పందించకపోవడం వల్ల, ప్రజలను అలర్ట్ చేయకపోవడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం పెద్ద ఎత్తున జరిగిందన్నారు హరీశ్‌రావు.పార్టీ తరపున వరద బాధితులకు సహాయం అందించేందుకు సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్, జగదీశ్ రెడ్డి, రవిచంద్ర, నామా నాగేశ్వర్ రావు, వివేకానంద గౌడ్, కౌశిక్ రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, శంభీపూర్ రాజు వచ్చాం. ప్రభుత్వం చేపడుతున్న వరద చర్యలు పరిశీలించేందుకు వచ్చాం. పాలేరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఉపేందర్ రెడ్డి సహాయం అందించారు. పువ్వాడ అజయ్ ఖమ్మంలో ఆయా డివిజన్ల ప్రజలకు నిత్యావసరాలు అందిస్తున్నారు. ఖమ్మం ప్రజలను ఆదుకోవాలని ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలని ముందుకు వచ్చాం. వార్డుల్లో ప్రజలను కలుస్తుంటే పరిస్థితి హృదయ విదారకంగా ఉంది. కళ్లల్లో నీళ్లు పెట్టుకుంటున్నారు. పసి పిల్లలకు పాలు దొరకక బాధపడు తున్నారు. తాగడానికి మంచినీళ్లు లేవు.. నిత్యావసరాలు అందించ డంలో ప్రభుత్వం విఫలం చెందిం దని తమ ఆవేదన వ్యక్తం చేశారని హరీశ్‌రావు తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముందుస్తుగా మైక్‌లో అనౌన్స్ చేసి అలర్ట్‌గా బయటకు తీసుకెళ్లారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి సహకారం అందిందింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలను అలర్ట్ చేయలేకపోయారు. వారి ప్రాణాలను కూడా కాపాడుకోలేకపోయింది. 9 మంది ఎమ్మెల్యేలను గెలిపించినా కూడా 9 మందిని కాపాడాలేకపోయారు. కనీసం హెలికాప్టర్‌ను కూడా పంపలేకపోయారు అని హరీశ్‌రావు మండిపడ్డారు.

## ఢిల్లీ మద్యం పాలసీ కేసు.. కేజ్రీవాల్, దుర్గేష్ పాఠక్‌లకు కోర్టు సమన్లు..

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసుకు సంబంధించి సీబై దాఖలు చేసిన చార్జిషీట్‌ను ఢిల్లీ కోర్టు పరిగణలోకి తీసుకున్నది. ఈ మేరకు ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు దుర్గేష్ పాఠక్‌లకు సమన్లు జారీ చేసింది. ఈ కేసు విచారణ సెప్టెంబర్ 11న విచారణ జరుగనున్నది. ఢిల్లీ ఎక్సైజ్ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆప్ మాజీ కమ్యూనికేషన్ ఇన్‌ఛార్జ్ విజయ్ నాయర్‌ను విడుదల చేస్తూ ఢిల్లీ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం ఆయనకు కోర్టు బెయిల్‌ను మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మార్చి 21న ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మనీలాండరింగ్ కేసులో జూన్ 20న ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ ఉత్తర్వులపై ఢిల్లీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జులై 14న ఈడీ కేసులో సుప్రీంకోర్టు బెయిల్‌ను మంజూరు చేసింది. సుప్రీంకోర్టును ఆశ్రయించే ముందే సీబీఐ ఆయనను అరెస్టు చేసింది. ప్రస్తుతం సీబీఐ కేసులో ఆయన జ్యుడీషియల్ కస్టడీపై తిహార్ జైలులో ఉన్నారు.



## నిందితుడికి మరణశిక్ష విధించాలి.. సీబీఐని డిమాండ్ చేసిన దీదీ

కోల్‌కతా: కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలి ఘటనలో నిందితుడికి మరణశిక్ష విధించాలని డిమాండ్ చేస్తున్నామని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తెలిపారు. ఇవాళ రాష్ట్ర అసెంబ్లీలో అపరాజిత బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా ఆమె ప్రసంగించారు. ఆగస్టు 9వ తేదీన లేడీ డాక్టర్ మృతిచెందిన తర్వాత.. ఆ రోజే ఆమె పేరెంట్స్‌తో మాట్లాడినట్లు చెప్పారు. వాళ్ల ఇంటికి వెళ్లడానికి ముందే.. ఆడియో, వీడియో, సీసీటీవీ ఫూటేజ్‌ను అందజేసినట్లు చెప్పారు.




ఆదివారం వరకు సమయం ఇవ్వాలని ఆ డాక్టర్ పేరెంట్స్‌ను కోరామని, ఒకవేళ దోషిని పట్టుకోకుంటే అప్పుడు కేసును సీబీఐకి అప్పగిస్తామని చెప్పామన్నారు. కానీ పోలీసులు 12 గంటల లోపే నిందితుడిని పట్టుకున్నారని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కేసును పరిష్కరించాలని పోలీసులకు చెప్పినట్లు సీఎం వెల్లడించారు. కానీ కేసును సీబీఐకి అప్పగించారని, అందుకే సీబీఐ ఈ కేసులో న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామని, నిందితుడికి మరణశిక్ష విధించాలని ముందు నుంచి డిమాండ్ చేస్తున్నట్లు మమతా బెనర్జీ తెలిపారు.అమ్మాయి హక్కులను రక్షించేందుకు ప్రతి రోజు పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. మహిళ పట్ల జరుగుతున్న వివక్షను రూపుమాపేందుకు 1981లోనే ఐక్యరాజ్యసమితి కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఆడ పిల్లల రక్షణ కోసం గళం వినిపిస్తున్న ప్రతి ఒక్కరికీ తాను కంగ్రాట్స్ చెబుతున్నట్లు సీఎం వెల్లడించారు. కోల్‌కతా ఆర్జీ కర్ కాలేజీ ఘటనలో ఇప్పటికే ప్రధాని మోదీ రెండు సార్లు లేఖలు రాసినట్లు చెప్పారు. ఆయన నుంచి తనకు రిప్లై రాలేదని, కానీ కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ నుంచి సమాధానం వచ్చినట్లు తెలిపారు. రేపిస్టులకు కఠిన శిక్ష విధించాలని కోరుతూ ఇవాళ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన అపరాజిత బిల్లు పాసైంది.

## మెదక్ జిల్లాలో అమానుషం.. మంత్రాల పేరుతో చెట్టు కట్టేసి కొట్టడంతో వ్యక్తి మృతి


మెదక్ : శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశం ఎంతో అభివృద్ధి చెందినా కొంతమంది ప్రజలు ఇంకా మూఢ నమ్మకాలను వీడటం లేదు. హైటెక్ యుగంలో సైతం మంత్రాలు బాణమతి, చేతబడి చేశారనే అనుమా నంతో దాడులకు పాల్పడుతూ అమాయకుల ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. తాజాగా మెదక్ జిల్లాలో అమానవీయ సంఘటన చోటు చేసుకుంది. మంత్రాల నెపంతో ముగ్గురిపై దాడి చేయడంతో ఓ వ్యక్తి మృతి(చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.ఈ విషాదకర సంఘటన జిల్లాలోని టెక్మాల్ మండలం గొల్లకుంట తండాలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. తండాకు చెందిన ముగ్గురు వ్యక్తులను మంత్రాల నెపంతో చెట్టుకు కట్టేసి దాడికి పాల్పడ్డా రు. ఈ దాడిలో రాములు అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

న్యూఢిల్లీ: హరియాణ అసెంబ్లీ ఎన్నికలు మరో నెలలో జరగనుండటంతో ఆ రాష్ట్రంలో ఆప్‌తో పొత్తుకు కసరత్తు సాగించాలని రాష్ట్ర కాంగ్రెస్ నేతలను కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ కోరారు. కాంగ్రెస్



ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ ఎన్నికల కమిటీ భేటీలో రాహుల్ గాంధీ ఆప్‌తో పొత్తు ప్రతిపాదనను పరిశీలించాలని పార్టీ ముందుంచినట్టు సమాచారం. పంజాబ్‌లో 90 అసెంబ్లీ స్థానాలకు గాను ఆప్ అభ్యర్థులకు 3, 4 స్థానాలు కేటాయించాలని కోరినట్టు పంజాబ్ మాజీ సీఎం భూపేందర్ సింగ్ హుడా చెప్పారు.ఇక 30 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన కాంగ్రెస్ పార్టీ త్వరలో జాబితాను విడుదల చేయనుంది. ఆప్‌తో ఎన్నికల పొత్తుకు సంబంధించి చర్చలపై కాంగ్రెస్ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి దీటైన పోటీ ఇవ్వడం ద్వారా విపక్ష ఇండియా కూటమి పటిష్టంగా ఉందనే సంకేతాలు పంపేందుకు రాహుల్ గాంధీ ఆప్‌తో పొత్తుకు ఆసక్తి కనబరుస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పంజాబ్‌లో ఇటీవల ముగిసిన పార్లమెంట్ ఎన్నికల్లో పది స్థానాలకు గాను విపక్ష కూటమి 5 స్థానాల్లో విజయం సాధించింది.2019 సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం పది స్థానాలనూ బీజేపీ గెలుచుకుంది. పంజాబ్‌లో కాంగ్రెస్ పరిస్థితి మెరుగవడంతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది సత్తా చాటాలని కాషాయ పార్టీని మట్టికరిపించాలని రాహుల్ గాంధీ కసరత్తు సాగిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్‌తో పొత్తు విషయంలో ఆప్ ఇంకా ఎలాంటి నిర్ణయం వెల్లడించలేదు. మనీల్యాండరింగ్ కేసులో ప్రస్తుతం జైలులో ఉన్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌తో సంప్రదించిన మీదట ఈ దిశగా తుది నిర్ణయం తీసుకుంటామని ఆప్ ఎంపీ, ఆ పార్టీ సీనియర్ నేత సంజయ్ సింగ్ తెలిపారు.


## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్.. 10 మంది మావోయిస్టులు హతం



ఛత్తీస్‌గఢ్ లో మంగళవారం భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. బీజాపూర్ ? దంతెవాడ జిల్లాల సరిహద్దుల్లో చోటు చేసుకున్న ఈ ఎదురుకాల్పుల్లో 10 మంది మావోయిస్టులు హతమయ్యారు.ఆ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న ముందస్తు సమాచారంతో భద్రతా బలగాలు ఆపరేషన్ ప్రారంభించారు. సోదాల సమయంలో భద్రతా బలగాలకు మావోలు తారసపడ్డారు. ఈ క్రమంలో అక్కడ ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇప్పటి వరకూ 10 మంది నక్సలైట్లు హతమైనట్లు సమాచారం. ప్రస్తుతం అక్కడ ఆపరేషన్ కొనసాగుతోంది. మృతి చెందిన వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది.'దంతెవాడ ? బీజాపూర్ జిల్లా సరిహద్దు ప్రాంతంలో వెస్ట్ బస్తర్ డివిజన్‌కు చెందని మావోయిస్టుల ఉనికి గురించి సమాచారం అందింది. పోలీసులు అర్ధరాత్రి ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు. ఈ క్రమంలో ఇవాళ ఉదయం 6 గంటల సమయంలో మావోలు ? పోలీసులకు మధ్య ఎదురు కాల్పులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం అక్కడ ఆపరేషన్ కొనసాగుతోంది' అని దంతెవాడ పోలీసులు తెలిపారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వట్టెం రిజర్వాయర్ పంపు హౌస్ నీట మునిగింది : మర్రి జనార్దన్ రెడ్డి

నాగర్‌కర్నూల్ : ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వట్టెం రిజర్వాయర్ పంపు హౌస నీట మునిగిందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి విమర్శించారు. వర్షాలకు వట్టెం(పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం) జలాశయం లోకి వరదనీరు చేరడంపై ఆయన స్పందించారు. ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడం వల్లే పంపు హౌస్ నీట మునిగిందని ఆరోపించారు. రైతుల పట్ల నిర్లక్ష్యమే ఈ పంప్ హౌస్ మునగుటకు కారణం అన్నారు. భారీ వర్షాలు కురుస్తున్నా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయకపోవడం వల్లే ఈ నష్టం జరిగిందని పేర్కొన్నారు.త్వరితగతిన ఈ నష్టాన్ని అంచనా వేసి వట్టెం పంప్ హౌస్ పనులు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సాగు, తాగునీరు అందించే సదుద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ప్రారంభించింది. ప్రభుత్వం వెంటనే స్పందించి వర్షాలకు నష్టపోయిన పంటలను అంచనా వేయాలి. తెగిన చెరువులు, కుంటలకు మరమ్మతులు చేయాల్నారు. బీటీ రోడ్లను పునరుద్ధరించి రైతులకు పంట నష్ట పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.



# ఆ పదిపైనే ఆశలు...

విశాఖపట్టణం, సెప్టెంబర్ 3,2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. అయితే కొత్తగా ఏర్పడిన తెలంగాణ పదేళ్లలో గణనీయమైన అభివృద్ధి సాధించింది. కానీ, ఆంధ్రప్రదేశ్ ఉన్న వనరులను కోల్పోవడంతో అభివృద్ధి చెందలేదు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ సర్కార్.. అమరావతిని రాజధానిగా ఎంపిక చేసి నిర్మాణాలు చేపట్టింది. కానీ, 2019 ఎన్నికల్లో అధికారం కోల్పోవడం, వైసీపీ అధికారంలోకి రావడంతో మళ్లీ అంతా మారిపోయింది. వైసీపీ అమరావతిని కేవలం శాసన రాజధానిగానే చేస్తామని ప్రకటించింది. కర్నూల్‌ను న్యాయ రాజధానిగా, విశాఖను అడ్మినిస్ట్రేషన్ రాజధానిగా చేస్తామని తెలిపింది. దీంతో అమరావతిలో నిర్మాణాలు ఆగిపోయాయి. కోర్టు కేసుల కారణంగా మూడు రాజధానుల అంశం ముందుకు సాగలేదు. కేవలం బటన్లు నొక్కడం, డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం ద్వారా సంక్షేమం అందిస్తున్నామని భావించిన జగన్ ప్రభుత్వం కనీసం రోడ్లను కూడా అభివృద్ధి చేయలేదు. ఈ నేపథ్యంలో 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా కావాలని తిరిగి టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వాన్ని భారీ మెజారిటీతో గెలిపించారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ప్రస్తుతం అభివృద్ధిపైనే దృష్టి పెట్టారు. రాష్ట్రాన్ని ప్రగతిశీల రాష్ట్రంగా మార్చేందుకు రాబోయే ఐదేళ్లలో 10 ప్రాంతాలను జాబితా చేసింది. అమరావతిలో రాజధాని నగరం నిర్మాణం, నదుల అనుసంధానం, నైపుణ్య గణన, పరిశ్రమలు, సేవలు, జనాభా నిర్వహణ వంటి కొన్ని కీలకమైన అంశాలని అధికారిక ప్రకటనలో పేర్కొంది.స్మార్ట్ ఫారెస్ట్ సిటీ?మెక్సికో, టెలోసా?అమెరికా, ది లైన్?సౌదీ అరేబియా, ఓషియానిక్స్‌తోపాటు ప్రపంచంలోని ఆరు అత్యంత భవిష్యత్ నగరాల్లో ఒకటిగా అమరావతి గ్రీన్‌ఫీల్డ్ రాజధాని నగరం ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉంది. అమరావతిని రాష్ట్ర గ్రోత్ ఇంజిన్‌గా పరిగణిస్తామని చంద్రబాబు ప్రకటించారు.. దానికి అనుగుణంగా, టీడీపీ ప్రభుత్వం 2014 ? 2019 మధ్య కాలంలో దాని అభివృద్ధికి భారీగా ఖర్చు చేసింది. తాజాగా రాజధాని ప్రాజెక్ట్ కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. దీని కోసం 2014లో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయబడింది. 217 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కీలకమైన రాజధాని నగరం? 8,603 విస్తీర్ణంలో పెద్ద రాజధాని ప్రాంతం రెండింటిని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.ఇక ఏపీలో నదుల అనుసంధానం ద్వారా మెరుగైన నీటి నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా వంశధారను నాగావళి, కృష్ణ, గోదావరి, పెన్నా నదులతో అనుసంధానం చేసి సాగునీరు, తాగు, పారిశ్రామిక అవసరాలకు వినియోగించుకోవాలని భావిస్తోంది. తర్వాత పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, ప్రత్యేకించి వ్యవసాయ రంగానికి కీలకమైన బహుళార్ధసాధక పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడానికి ప్లాన్ చేసింది.ఏపీలో జనాభా నిర్వహణలో భాగంగా, రాష్ట్రం తగినంత ఉత్పాదక శ్రామిక శక్తిని కలిగి ఉండేలా సంతానోత్పత్తి రేటును పెంచడానికి తగిన ప్రాధాన్యతతో ప్రభుత్వం జనాభా నియంత్రణ నుంచి సమతుల్యత వైపుకు వెళుతోంది.ఇక తర్వాత ఫోకస్ ఏరియా 'పీ?4' అంటే పీపుల్?పబ్లిక్?ప్రైవేట్? పార్టనర్‌షిప్. వృద్ధి రేటును పెంచడంలో ఇది ఉత్ప్రేరక పాత్ర పోషిస్తుందని అంటున్నారు. ఇందులోని ప్రధాన లక్ష్యాలు ప్రభుత్వ జోక్యం ద్వారా ఉన్నవారు, లేనివారి మధ్య అంతరాన్ని తగ్గించడం (ఆర్థిక అసమానతలను తగ్గించడం) , పేదలకు సహాయం చేయడానికి ధనికులను ప్రేరేపించడం.. ఉత్పత్తి పెంచడం.. సామర్థ్య నిర్మాణం , పరిశ్రమలు , వ్యాపారాలను హ్యాండ్‌హోల్డింగ్ చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ చాలా బలంగా ఉన్న రంగాలలో ఉపాధి కల్పిస్తారు.పరిశ్రమలు, పర్యాటకం, సేవల రంగాలను ప్రోత్సహించడం అనేది నాణ్యమైన ఉత్పాదకతను సాధించడమే లక్ష్యంగా ఉన్న మరొక ఫోకస్ ప్రాంతం. లక్ష్యాలలో వ్యాపారాలకు అనుకూలమైన వాతావరణాన్ని అందించడం, ముఖ్యంగా తయారీ పరిశ్రమలు.. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు పెట్టుబడులను ఆకర్షించడం, యువతను పారిశ్రామికవేత్తలుగా మార్చడం చేస్తారు.పారిశ్రామిక ఉద్యానవనాలలో అత్యుత్తమ అంతర్గత మౌలిక సదుపాయాలను రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ?ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటోమొబైల్, పునరుత్పాదక శక్తి, టెలికమ్యూనికేషన్స్, కెమికల్ మ్యానుఫ్యాక్చరింగ్ సబ్‌సెక్టార్‌లకు ప్రాధాన్యతనిస్తూ కొత్త పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తారు.. కుప్పం, మూలపేట, చిలమత్తూరు, దొనకొండలో కొత్త పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధికి చర్యలు చేపడుతారు.ప్రభుత్వం పునరుత్పాదక శక్తిని, ప్రత్యేకించి విపరీతమైన పరిధిని కలిగి ఉన్న సౌరశక్తిని వినియోగించుకోవడం, విద్యుత్ చలనశీలత సామర్థ్యాన్ని గ్రహించడం లక్ష్యంగా పెట్టుకుంది. విజన్?2047, అన్నా క్యాంటీన్లు , సముద్రం , విమానాశ్రయాల అభివృద్ధి, రహదారి మౌలిక సదుపాయాలు కల్పించి ఏపీని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తారు.

## ఏపీకి పొంచి ఉన్న ముప్పు

విజయవాడ, సెప్టెంబర్ 3, ఆంధ్రప్రదేశ్‌కు వాయుగండం ముప్పు తొలగిపోయిందని ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే ఇంతలో మరో ముప్పు ఏపీని వెంటాడుతోంది. రాష్ట్రంలో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ నెల 5, 6 తేదీల్లో బంగాళాఖాతంలోని ఉత్తర అండమాన్ ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కోస్తాంధ్ర తీరాన్ని ఆనుకొని ఏర్పడనున్న అల్పపీడనం ప్రభావంతో ఏపీలో మళ్లీ వర్షాలు కురుస్తాయని భావిస్తున్నారు. ఒకవేళ బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనం మెల్లిగా బలపడి తుఫాన్‌గా మారి విశాఖపట్నం, ఒడిశా దిశగా ప్రయాణించి తీరం దాటే అవకాశం ఉన్నట్లు మరో అంచనా వేస్తున్నారు. బుధవారంలోపు ఈ అల్పపీడనంపై పూర్తిగా క్లారిటీ వస్తుందంటున్నారు.ఈ అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 6, 7 తేదీల్లో కోస్తాలోని పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు.. అక్కడక్కడ మాత్రం భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ నెల 7న ఉమ్మడి తూర్పు గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయంటున్నారు. వాయుగుండం ప్రభావం నుంచి ఇంకా పూర్తిగా తేరుకోకముందే మరో అల్పపీడనం ఇప్పుడు అందరిని టెన్షన్ పెట్టిస్తోంది.అంతేకాదు రాజస్థాన్‌లోని జైసల్మేర్ నుంచి విదర్భ, తెలంగాణ మీదుగా మచిలీపట్నం వరకు రుతుపవన ద్రోణి ఆవరించబోతున్నట్లు మరో అంచనా ఉంది. అలాగే బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం హారాష్ట్రలోని తూర్పు విదర్భ, తెలంగాణ పరిసరాల్లో కొనసాగుతోంది. ఈ వాయుగుండం రాబోయే 12 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ తీవ్ర అల్పపీడనంగా బలహీనపడుతుందని తెలిపింది వాతావరణశాఖ. ఈ ప్రభావంతో ఏపీలో రాబోయే ఐదు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు.గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో బలమైన గాలులు వీస్తాయని చెబుతున్నారు.వచ్చే రెండు, మూడు రోజుల్లో కృష్ణానదికి వరద ప్రవాహం మళ్లీ పెరిగే అవకాశం ఉందంటున్నారు. అల్పపీడన ద్రోణి ప్రభావంతో మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో వానలు పడుతున్నాయి.. ఇప్పటికే కృష్ణా పరీవాహక ప్రాంతంలోని ప్రాజెక్టులన్నీ నిండిపోవడంతో వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేయాల్సిన పరిస్థితి ఉంది. దీంతో శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతలకు వరద పెరుగుతుందని ఓ అంచనా ఉంది. ప్రస్తుతం ఉన్న వరద మంగళ, బుధవారాల్లో మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజ్ దగ్గర వరద కాస్త తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం బ్యారేజీ దగ్గర 9.40 క్యుసెక్కుల వరద ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇవాళ మరికొంత వరద తగ్గే అవకాశం ఉంది.

## కొనసాగుతున్నా......నామినేటెడ్ పదవుల కసరత్తు

గుంటూరు, సెప్టెంబర్ 3 ఏపీలో నామినేటెడ్ పోస్టుల సందడి ప్రారంభమైంది. 20 రోజుల్లో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయడానికి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. దీంతో ఆశావహుల్లో ఆశలు చిగురించాయి. ఇప్పటికే నామినేటెడ్ పోస్టుల కోసం వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. పదవులు వందల్లో ఉంటే.. వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. మూడు పార్టీల శ్రేణులు పదవులపై ఆశ పెట్టుకున్నాయి. దీంతో నామినేటెడ్ పదవుల పంపకం కత్తి మీద సాము కానుంది. మూడు పార్టీల కూటమి నేపథ్యంలో.. నామినేటెడ్ పదవుల్లో సైతం తమకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆ రెండు పార్టీలు కోరుతున్నాయి. జనసేన అయితే 100% విజయంతో దూకుడుగా ఉంది. కేవలం 21 స్థానాల్లో పోటీ చేసి.. అన్ని స్థానాలను కైవసం చేసుకుంది. మిగతా చోట్ల కూటమి గెలుపునకు కృషి చేసింది. అందుకే నేతల కృషిని గుర్తించి ఎక్కువ శాతం నామినేటెడ్ పదవులు కేటాయించాలని ఆ పార్టీ కోరుతోంది. మరోవైపు బిజెపి సైతం ఇదో చక్కటి అవకాశంగా భావిస్తోంది. ఏపీలో బలపడాలన్న ఆకాంక్షతో ఉన్న బిజెపి వీలైనంత ఎక్కువగా నామినేటెడ్ పోస్టులు తీసుకోవాలని చూస్తోంది. ఆ రెండు పార్టీల ఒత్తిడితో చంద్రబాబు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.వాస్తవానికి ఆగస్టు 17 నాటికి నామినేటెడ్ పదవులను ఖాయం చేస్తారని ప్రచారం సాగింది. టీటీడీ అధ్యక్ష పదవి నుంచి మార్కెట్ కమిటీల వరకు అన్ని ఒకేసారి ప్రకటిస్తారని టాక్ నడిచింది. కానీ ఎందుకో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. మూడు పార్టీల మధ్య సయోధ్య కుదరక నిలిపివేసినట్లు ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు మరోసారి కదలిక వచ్చింది. 20 రోజుల్లో నామినేటెడ్ పదవులను ప్రకటిస్తారని తెలుస్తోంది.అయితే మూడు పార్టీల్లో ఆశావాహులు అధికంగా ఉన్నారు. పొత్తులో భాగంగా టిడిపి 31 అసెంబ్లీ స్థానాలను వదులుకుంది.

## అంబటి, పేర్ని లే వాయిస్ లా..

గుంటూరు, సెప్టెంబర్ 3, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత లీడర్ల గొంతులు మూగబోయాయి. కనీసం పార్టీ తరుపున మాట్లాడేందుకు నేత కూడా లేరు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు మంత్రులు, అధికార ప్రతినిధులు, ప్రత్యేక సలహాదారులు ఇలా మూకుమ్మడిగా చుట్టుముట్టేవారు. అప్పటి ప్రతిపక్షంపై విరుచుకుపడే వారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఎందరో నేతలు క్యూ కట్టేవారు. అవతలి వారి నోటిని కట్టిపడేసేవారు. కానీ ఇప్పుడు ఇద్దరు నేతలు మాత్రమే తరచూ కనిపిస్తున్నారు. అధికార పార్టీ చేసే విమర్శలకు వారిద్దరు మాత్రమే సమాధానం చెబుతున్నారు. మిగిలిన నేతల నుంచి ఎటువంటి రెస్పాన్స్ లేకపోవడంపై పార్టీలో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. అధికారంలో లేనప్పుడు కూడా... ఒకరు పేర్ని నాని. మాజీ మంత్రిగా పనిచేసిన పేర్ని నాని అధికారంలో ఉన్నప్పుడు లేనప్పుడు కూడా ఆయన దాదాపు ప్రతిరోజూ మీడియా సమావేశం ఏర్పాటు చేసి దుమ్ము దులిపేవారు. చంద్రబాబు, నారా లోకేష్, పవన్ కల్యాణ్ ఇలా ఎవరినీ వదలిపెట్టకుండా విమర్శించేవారు. పేర్ని నాని సబ్జెక్ట్‌పై అవగాహన పెంచుకుని మరీ నిఖార్సయిన జవాబిచ్చేవారు. మంత్రి పదవి కోల్పోయిన తర్వాత కూడా ఆయన మైకును వదలలేదు. ఇక గత ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. స్వచ్ఛందంగా పోటీ నుంచి తప్పుకుని తన కుమారుడికి అవకాశమివ్వాలని కోరగా జగన్ అందుకు అంగీకరించారు. అయితే పేర్ని కిట్టు గత ఎన్నికల్లో ఓటమి పాలయిన తర్వాత కూడా విపక్షంలోకి వచ్చిన తర్వాత సూటిగా, సుత్తిలేకుండా అధికార పక్షానికి సమాధానమిస్తున్నారు.జగన్ ను విమానాశ్రయంలో రిసీవ్ చేసుకునే దగ్గర నుంచి కార్యకర్తల పరా?మర్శ వరకూ పేర్ని నాని యాక్టివ్ గా ఉన్నారు. తాను ఎన్నికల్లో పోటీ చేయనిది రాజకీయంగా విశ్రాంతి తీసుకోవాలని పేర్ని నాని తెలిపారు. తాను తొలి నుంచి వై?ఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానని, ఆయన తనయుడు వైఎస్ జగన్ తోనే తన రాజకీయ జీవితం కొనసాగుతుందని చెప్పారు. రాజకీయంగా విశ్రాంతి తీసుకుంటానన్న పేర్ని నాని ఎన్నికలలో ఓటమి తర్వాత మాత్రం ఆ ఆలోచనను విరమించుకున్నారు. మచిలీపట్నం మాత్రమే కాకుండా పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చి మరీ దాదాపు ప్రతి రోజూ అధికార పక్షానికి కౌంటర్ ఇస్తున్నారు. దీంతో వైసీ?పీ క్యాడర్ కూడా పేర్ని నానిని సోషల్ మీడియాలో ప్రశంసలతో ముంచెత్తుతుంది. ఒక మరో నేత అంబటి రాంబాబు. ఆయన కూడా మాజీ మంత్రిగా ప్రస్తుతం వైసీపీ వాయిస్ ను బలంగా వినిపిస్తున్నారు. ప్రధానంగా పోలవరంతో పాటు పోలింగ్ శాతం, ఈవీఎంలు ఇలా అనేక విషయాలపై తక్షణమే స్పందిస్తున్నారు. అంబటి రాంబాబు కూడా గతంలో అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ, జనసేన అధినేతలను తూర్పారపట్టేవారు. ఇరిగేషన్ మంత్రిగా చేసిన అంబటి రాంబాబు అనేక అంశాలపై ఇప్పటికీ యాక్టివ్ గా స్పందిస్తున్నారు. ఇద్దరు నేతలు తొలి నుంచి వైఎస్ జగన్ వెంట నడిచిన వారే. ఇద్దరూ కాపు సామాజికవర్గానికి చెందిన వారే. జగన్ సామాజికవర్గానికి చెందిన నేతలు ఎవరూ పెదవి విప్పక పోయినా వీరిద్దరూ వైసీపీకి మైకులుగా మారి కొంతవరకూ పార్టీని కొంత మేర ప్రజల్లోకి తీసుకెళుతున్నారు.

## పీకల్లోతు కష్టాల్లో బెజవాడ..

### 121 ఏళ్లలో ఎన్నడూ చూడని వరద

విజయవాడ, సెప్టెంబర్ 3 ఆగస్టు 30 నుంచి నిన్నటి వరకూ తెలుగు రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్థమైంది. ఆకస్మిక వరదలతో లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వగా.. పీకల్లోతు నీటిలో ఉన్నవారందరినీ రెస్క్యూ బృందాలు బోట్లు, ట్రాక్టర్ల సహాయంతో పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. భారీ వర్షానికి విజయవాడ పరిస్థితి దయనీయంగా మారింది. వర్షాలు తగ్గినా.. బుడమేరు కట్ట తెగడంతో సింగ్ నగర్, రాణిగారితోట, ఆ పరిసర ప్రాంతాలు వరదముంపుకు గురయ్యాయి. అక్కడి నివాసితులంతా ఇళ్లను వదిలేసి పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు.మరోవైపు.. ప్రకాశం బ్యారేజీకి వరద పోటెత్తడంతో అధికారులు 70 గేట్లను ఎత్తి వరద నీటిని సముద్రంలోకి వదిలారు. విజయవాడను కృష్ణమ్మ పరవళ్ల నుంచి కాపాడేందుకు కట్టిన రిటైనింగ్ వాల్ కూడా వరద తాకిడికి ప్రమాదంలో ఉన్నట్లు తెలుస్తోంది. కృష్ణలంక ప్రాంతం ఇప్పటికే నీటిలో నానుతోంది. రిటైనింగ్ వాల్ కట్టను తెంచుకుని కృష్ణమ్మ దారితప్పితే కృష్ణలంక కూడా వరదనీటిలో పూర్తిగా మునిగిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. స్థానికులు ఇసుక కట్టలతో వరద తాకిడికి అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్నారు.ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానదికి వస్తున్న వరదను గడిచిన 121 ఏళ్లలో ఎప్పుడూ చూడలేదంటున్నారు అధికారులు. 1903 అక్టోబర్ లో 10 లక్షల 60వేల 830 క్యూసెక్కుల వరద రాగా.. ఆ తర్వాత 106 సంవత్సరాలకు 2009 అక్టోబర్ లో 10 లక్షల 94 వేల 422 క్యూసెక్కుల వరద నదికి పోటెత్తింది. ఈసారి వచ్చిన వరద ఆ రికార్డును దాటేసింది. ఏకంగా 11 లక్షల క్యూసెక్కులకు పైగా వరదనీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. 11.36 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి 500 క్యూసెక్కుల నీటిని పంట కాల్వల్లోకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద నది నీటిమట్టం 24.2 అడుగుల వద్ద ఉండగా.. అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీచేశారు.కృష్ణమ్మ ఉగ్ర రూపాన్ని చూసిన ప్రజలు.. అమ్మా !శాంతించమ్మా.. అంటూ పూజలు చేస్తున్నారు. కృష్ణమ్మ ఉరకలు చూసి భయాందోళనకు గురవుతున్నారు. వరద మరింత పెరిగితే మరిన్ని లోతట్టు ప్రాంతాలు, చుట్టుపక్కల గ్రామాలు వరద ముంపుకు గురయ్యే ప్రమాదం ఉంది. సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.బ్యారేజీ గేట్లన్నీ ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తుండగా.. పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మను చూసేందుకు విజయవాడ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఘాట్ కు పర్యాటకులు పోటెత్తుతున్నారు. లేక్ వ్యూ పాయింట్ పార్క్ లోకి వరద నీరు ఎదురు వస్తుండటంతో పార్క్ ను క్లోజ్ చేశారు. సందర్శకులెవరూ రావొద్దని పోలీసులు వారిస్తున్నా.. జనం వినకుండా నది వద్దకు చేరుకుంటుండటంతో వారిని కంట్రోల్ చేయడం పెద్ద టాస్క్ గా మారింది. ప్రకాశం బ్యారేజీ వద్ద పిల్లర్ నంబర్ 69కి బోట్లు కొట్టుకు రావడంతో.. పిల్లర్ పాక్షికంగా డ్యామేజ్ అయినట్లు వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.సికింద్రాబాద్ నుంచి విజయవాడకు వచ్చే ట్రైన్ మార్గం మధ్యలో మహబూబాబాద్ వద్ద ట్రాక్ కొట్టుకుపోవడంతో.. ఆ మార్గంలో వచ్చే రైళ్లను గుంటూరు మీదుగా దారి మళ్లించిన విషయం విధితమే.

## కడప స్టీల్ ప్లాంట్ పై చర్యలు తీసుకోండి

కడప ఏపీసీసీ ఛీఫ్ వై ఎస్ షర్మిల మంగళవారం నాడు కడప జిల్లా కలెక్టర్ ను కలిసి స్టీల్ ప్లాంట్ నిర్మాణంపై తక్షణం చర్యలు చేపట్టాలని వినతి పత్రం ఇచ్చారు.తరువాత ఆమె మీడియాతో మాట్లాడుతూ కడప స్టీల్ ప్లాంట్ వైఎస్సార్ సంకల్పం. ఇక్కడ స్టీల్ ప్లాంట్ స్థాపించి 25 వేల మందికి ప్రత్యక్ష ఉపాది కల్పించాలని అనుకున్నారు. లక్ష మందికి పరోక్ష ఉపాధి కల్పించాలని అనుకున్నారు. 20 వేల కోట్ల పెట్టుబడులతో, 20 మిలియన్స్ టన్స్ ఉత్పత్తి సామర్థ్యం తో కడప స్టీల్ ప్లాంట్ స్థాపనను అంతా సిద్ధం చేశారు. 10 వేల ఎకరాల్లో ప్లాంట్ విస్తరణకు అంతా సిద్ధం చేశారు. 2007 జూన్ 10 న శంకుస్థాపన కూడా చేశారు.అయన మరణం తర్వాత? స్టీల్ ప్లాంట్ నిర్మాణం పునాది రాయిగానే మిగిలిందని అన్నారు. 2019 డిసెంబర్ 23 న మళ్లీ స్థలాన్ని మార్చి శంకుస్థాపన చేశారు ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ చెప్పిన మాట. ఎన్నికలకు ఆరు నెలల ముందు టెంకాయ కొడితే మోసం అంటారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే టెంకాయ కొడితే చిత్తశుద్ధి అంటారు.. కడప స్టీల్ ఫ్యాక్టరీ కట్టి జన్మనిచ్చిన జమ్మలమడుగు రుణం తీర్చుకుంటా అన్నారు. కడప స్టీల్ పై మాకుంది చిత్తశుద్ధి అన్నాడు. ?మూడేళ్లలో పరిశ్రమ పూర్తి చేస్తా అని హామీ ఇచ్చాడు. ?లిబర్టీ స్టీల్, ఎస్సార్ స్టీల్ కంపెనీలకు ప్లాంట్ పనులు అపగించారు. 15 వేల కోట్లతో ప్లాంట్ కడతాం అని చెప్పాడు. మూడేళ్లు కాలాయాపన చేసి జగన్ సైతం ఎన్నికలకు ఏడాది ముందు మళ్లీ ఆయన పాలనలో రెండో సారి శంకుస్థాపన చేశాడని అన్నారు.2023 ఫిబ్రవరి 15 న అదే స్టీల్ ప్లాంట్ కి జగన్ మళ్లీ శంకుస్థాపన చేశాడు. 8,800 కోట్లతో జిందాల్ స్టీల్ తో ఒప్పందం చేశాడు. 3500 ఎకరాల భూమిని జిందాల్ కి అప్పగించాడు. జగన్ వేసిన శంకుస్థాపన శిలాఫలకం దిష్టిబొమ్మలా మారిందే తప్పా . విభజన చట్టం ప్రకారం కేంద్రం స్టీల్ ప్లాంట్ నిర్మించి ఇవ్వాలి. కానీ కడప స్టీల్ ప్లాంట్ కి కేంద్రం ఏమి చేయదు అని పార్లమెంట్ వేదికగా మోదీ సర్కార్ తేల్చి చెప్పింది. కడప స్టీల్ లాభదాయకం కాదు అన్నారు. సాంకేతికంగా, ఆర్థికంగా సాధ్యపడదు అన్నారు. కావాలంటే రాష్ట్ర ప్రభుత్వమే కట్టుకోండి అని రాయలసీమ ప్రజలను మోసం చేశారు. కడప స్టీల్ అంటే టెంకాయలు కొట్టే ప్రాజెక్ట్ గా మార్చారు. శంకుస్థాపనల ప్రాజెక్ట్ గా మార్చారు. ముఖ్యమంత్రులు మారితే స్థలాలు మార్చే ప్రాజెక్ట్ గా మార్చారు. అంతే తప్పా ఎవరికి చిత్తశుద్ధి లేదని అన్నారు.షజిందాల్ కంపెనీ ప్రాజెక్ట్ నిర్మాణంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. పైగా పదే పదే తాడేపల్లి ప్యాలెస్ లో సజ్జన్ జిందాల్ కలుస్తుంటే కడప స్టీల్ వేగవంతం చేస్తున్నారు అనుకున్నారు. కాని ఒక మహిళా కాదంబరి విషయం బయట పడే సరికి ఇందుకా.. అని ఆశ్చర్య పోవాల్సిన పరిస్థితి. పదే పదే జగన్ ని కలుస్తుంటే కడప స్టీల్ మీద చిత్తశుద్ధి అనుకున్నాం. కానీ ఒక మహిళను కట్టడి చేసేందుకు స్కీమ్ లు వేశారని అర్థం అయింది. ఇది మామూలు మాస్టర్ ప్లాన్ కాదు. ?ఆడదాన్ని ఒక్క దాన్ని చేసి తొక్కాలని చూశారు. జె అండ్ జె ఇద్దరు కలిసి బుర్రలు పెట్టారు. జె స్వేర్ కలిసి కార్యాచరణ చేశారు. మీ బుర్రలు కడప స్టీల్ మీద పెట్టి ఉంటే ప్రాజెక్ట్ ఎప్పుడో పూర్తి అయ్యేది. సజ్జన్ జిందాల్ గతంలోనే జగన్ గురించి చెప్పారు. ఇద్దరు మంచి దోస్త్ లు అని చెప్పాడు. జగన్ అన్నని అడుగుతున్నాం. రాష్ట్రానికి జిందాల్ ఏమి చేశాడు అని వేల ఎకరాలు భూములు కట్ట బెట్టారు. ?జిందాల్ కి 3500 ఎకరాలు అప్పగిస్తే ఎందుకు పనులు ప్రారంభించలేదు. జేత్వాణి ఒక డాక్టర్. ఆమె ఒక నటి. జేత్వాణి ది ఒక గొప్ప కుటుంబం. ఆమె ఒక కేసు పెడితే .. ఆమెను తొక్కాలని చూశారు. నిజంగా కాదంబరి మోసం చేయాలని చూస్తే జిందాల్ ఒక 50 నో 100 కోట్లు ఇచ్చి సెటిల్మెంట్ చేసుకోనే వాడు కద. ఆమె న్యాయం కావాలని నిలబడింది. ?ఆమెను కట్టడి చేయడం కోసం ఐపీఎస్ అధికారులను ఉపయోగించారు. ఆమె మీద ఇది దారుణ చర్యఅని వ్యాఖ్యానించారు.

## జగన్ విదేశీ పర్యటన..

### ఏపీ పొలిటికల్ సర్కిల్స్ లో డిఫరెంట్ చర్చ



విజయవాడ, సెప్టెంబర్ 3 జగన్ విదేశీ పర్యటన నుంచి వచ్చేసరికి వైసిపి ఖాళీ అవుతుందా? ఆ పార్టీని వీడేందుకు చాలామంది సిద్ధంగా ఉన్నారా?తెర వెనుక ఏదో జరుగుతోందా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. టిడిపి అనుకూల మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. జగన్ కుటుంబ సమేతంగా లండన్ వెళ్ళనున్నారు.దాదాపు 20 రోజులు పాటు అక్కడే ఉంటారు. కూతురి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొంటారు. విదేశాలకు వెళ్లేందుకు ఇప్పటికే సిబిఐ అనుమతి తీసుకున్నారు జగన్. ఈరోజు తండ్రి రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కావడంతో ఇడుపాలపాయలో నివాళులు అర్పించారు. ప్రత్యేక విమానంలో లండన్ వెళ్ళనున్నారు. గత మూడు రోజులుగా పులివెందుల నియోజకవర్గంలోనే జగన్ గడిపారు. తిరిగి ఈనెల 25న రాష్ట్రానికి రానున్నారు. అయితే ఆయన వచ్చే సమయానికి వైసీపీని అడ్డగోలుగా చీల్చుతారని ప్రచారం జరుగుతోంది. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీల అధినేతలు, ముఖ్యమంత్రులు విదేశాలకు వెళ్లే సమయంలో ఆ పార్టీని అడ్డగోలుగా చీల్చడం చూశాం. అధికారాన్ని హస్తగతం చేసుకోవడం చూశాం. అయితే ఇప్పుడు వైసీపీ బలాన్ని, బలగాన్ని తీసుకునే ప్రయత్నం చేస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే అది ఎంతవరకు సాధ్యమా అన్నది తెలియాల్సి ఉంది.ఇప్పటికే వైసీపీ నుంచి జంపింగ్ లు ప్రారంభమయ్యాయి. ఆ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీదా మస్తాన్ రావు పార్టీకి గుడ్ బై చెప్పారు. రాజ్యసభ పదవులకు రాజీనామా చేశారు. మరో ఎంపీ చేరెందుకు సిద్ధంగా ఉన్నారు. మరొకరి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మరో ఏడుగురు మాత్రం తాము జగన్ వెంటే ఉంటామని తేల్చి చెబుతున్నారు. వారిలో ఒకరిద్దరు తప్ప అంత వైసీపీకి వీర విధేయులు కావడం గమనార్హం. అయితే పరిస్థితులకు తగ్గట్టు చాలామంది నేతలు మారుతారు. వైసీపీ రాజ్యసభ సభ్యుల్లో చాలామందికి వ్యాపారాలు, వ్యాపార సంస్థలు ఉండడంతో.. వారు వైసీపీలో ఫిక్స్ గా ఉంటారా? లేదా? అన్నది అనుమానమే.మరోవైపు శాసనమండలిలో సైతం సభ్యులు కూటమి వైపు చూస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఎన్నికల్లో 164 అసెంబ్లీ సీట్లలో కూటమి గెలిచింది. కానీ శాసనమండలి విషయానికి వచ్చేసరికి కూటమి బలం అంతంత మాత్రమే.

# ప్రమాదంలో రాజధాని- ప్రత్యామ్నాయ రాజధాని

**కర్నూలు.రాష్ట్ర ప్రభుత్వం కర్నూలును రాష్ట్ర రాజధానిగా ప్రకటించాలి.**

**రా యలసీమ రవికుమార్.రాష్ట్ర అధ్యక్షులు,ఆర్వీపీఎస్.**

**సుంకన్న మదాసికురువరాష్ట్ర అధ్యక్షులు.ఆర్ హెచ్ పీఎస్.**




కర్నూలువిభారె న్యూస్ :శ్రీకృష్ణ కమిటీ,శివరామకృష్ణన్ కమిటీలు ముక్కారు పంటలు పండే అమరావతిలో రాజధాని కట్టవద్దని హెచ్చరించిన పెడచెవిన పెట్టిన ప్రభుత్వాలు నేడు వాస్తవ పరిస్థితులను చూస్తున్నారని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్, రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుంకన్న అన్నారు నగరంలోని స్థానిక ఆర్వీపీఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు అశోక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రాయలసీమ రవికుమార్,సుంకన్న మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని ప్రాంతం తీవ్రమైన వరదలతో ప్రజలు అల్లాడిపోతున్నారని గతంలో శ్రీకృష్ణ కమిటీ, శివరామకృష్ణన్ కమిటీలు అమరావతిలో ముక్కారు పంటలు పండే భూములున్నాయని రాజధాని నిర్మాణం చేపడితే వరదలకు అవకాశాలున్నాయని నివేదికల ద్వారా హెచ్చరించిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా అమరావతిలో రాజధాని నిర్మాణం చేపట్టాయని కమిటీలు హెచ్చరించినట్టుగానే నేడు రాజధాని ప్రాంతం వదరలతో అల్లాడిపోతుందని ఈ పరిస్థితి రాష్ట్ర ప్రజలను రాయలసీమ వాసులను ఆవేదనకు గురిచేస్తోందని ప్రస్తుత పరిస్థితులే ఇలావుంటే భవిష్యత్తులో భారీవర్షాలు కురిస్తే ప్రాంతం మునకకు గురవ్వడమేగాక ప్రభూత్వాల నిర్లక్ష్యంతో ప్రాణనష్టం,ఆస్తి నష్టం,ఆర్థిక నష్టాలకు దారితీసే అవకాశాలు ఉన్నాయని అన్నారు.ప్రమాధంలో ఉన్న రాజధానికి ప్రత్యామ్నాయ రాజధాని కర్నూలేనని కర్నూలు నగరానికి గతంలో 1953నుండి1956వరకు రాజధానిగా కొనసాగిన చారిత్రక నేపథ్యం ఉన్నదని కర్నూలులో ముప్పైవేల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని,మానవ తప్పిదాలు తప్ప వరదలకు,తుఫాను లకు గురయ్యే అవకాశాలు కర్నూలుకు ఏమాత్రం లేవని,భూమిలో పది అడుగులలోతు పునాధితో ఏమాత్రం ప్రమాదం లేనీ ఐదు అంతస్తుల భవనాలను నిర్మించవచ్చునని,రాష్ట్ర రాజధాని అత్యంత వెనుకబడిన రాయలసీమకు ప్రకటించడం ద్వారా రాయలసీమ,కోస్తా, ఉత్తరాంధ్ర ప్రాంతాల సమాన అభివృద్ధికి అవకాశం ఉందని కావునా రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు చంద్రబాబు నాయుడు గారు ఇప్పటికైనా ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని శ్రీబాగ్ ఒడంబడికను గౌరవిస్తూ రాష్ట్ర రాజధానిని కర్నూలులో ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వసంత్ కుమార్,విజయ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కోత మిషన్ షరీఫ్ సేవలు మరువలేనివి

**అపుస్మ నంద్యాల డివిజన్ అధ్యక్షులు అమీర్ భాష**



ఆళ్ళగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 03 విభారె న్యూస్ :- ప్రైవేటు పాఠశాలల అభివృద్ధి కోసం, సమస్యల పరిష్కారం కోసం కోత మిషన్ షరీఫ్ చేసిన సేవలు మరువలేని ప్రైవేట్ పాఠశాల సంఘం నంద్యాల డివిజన్ అధ్యక్షులు అమీర్ భాష, గౌరవ అధ్యక్షులు శ్రీనాథ్ రెడ్డిలు అన్నారు. పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో కోత మిషన్ షరీఫ్ సంస్మరణ సభ మంగళవారం నిర్వహించారు. ముందుగా షరీఫ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల అభివృద్ధి కోసం షరీఫ్ ఎంతో సేవ చేశారన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు మరో ఆరోగ్యం అవసరమని గుర్తించి



క్రీడలకు ప్రాధాన్యమిచ్చి విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించేందుకు ఇంత కృషి చేశారన్నారు ఆయన చేసిన సేవలు గుర్తుగా షరీఫ్ పేరుతో స్మారక ఛాంపియన్షిప్ ప్రదానం చేస్తామని వారు పేర్కొన్నారు. అనంతరం షరీఫ్ తనయుడు కౌన్సిలర్ హుస్సేన్ భాష మాట్లాడుతూ ఆయన సేవాలక్షణాలను, మంచితనాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుతానున్నారు. ఈ కార్యక్రమంలో షరీఫ్ తనయుడు రహీమ్,ప్రభుత్వ ఖాజీ మహమ్మద్ జాఫర్ సాదిక్, ప్రైవేట్ పాఠశాలల రెస్పాండెంట్స్ తిరుపాల్ రెడ్డి శివరామిరెడ్డి, సుబ్రహ్మణ్యం, శేఖర్ ,నాగరాజు, దస్తగిరి, మహబూబ్ బాషా, మల్లికార్జున, వీరా మోహన్ రెడ్డి, నజీర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# 4న గణేష్ నిమజ్జన మహోత్సవ ఏర్పాట్లపై సమావేశం

**నంద్యాల ఆర్డీఓ మల్లికార్జున్ రెడ్డి**

నంద్యాల, కందనవోలుసెప్టెంబర్ 03:-ఈ నెల 4వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3-00 గంటలకు కలెక్టరేట్ లోని సెంటినరీ హాలులో గణేష్ నిమజ్జన మహోత్సవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ మల్లికార్జున్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 11న స్థానిక చిన్నచెరువు కట్ట వద్ద ఉన్న వినాయక ఘాట్ లో గణేష్ నిమజ్జన మహోత్సవ ఏర్పాట్లకు సంబంధించి గణేష్ మహోత్సవ కేంద్ర సమితి కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న గణేష్ ఉత్సవ కేంద్ర సమితి కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొని సలహాలు, సూచనలిచ్చి విజయవంతా నికి సహ రించాలని ఆర్డీఓ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# వరద బాధితుల పట్ల నీకు చిత్తశుద్ది ఉంటే వెంటనే 100 కోట్ల విరాళాన్ని ప్రకటించాలి జగన్ కు సోమిశెట్టి డిమాండ్.

కర్నూలువిభారె న్యూస్ :వరదల కారణంగా విజయవాడ నగరం మోత్తం కూడా జలమయమైతే, ఒక పక్క వర్షాలతో నదులన్నీ నీటితో పొటెత్తాయి, వాగులు, వంకలు, చెరువులు తెగి నీరు క్రిష్ణానదికి చేరుకుంటే, ప్రజాజీవనం అస్తవ్యస్తమయింది. విజయవాడను నీటముంచెత్తగా ఇలాంటి పరిస్థితి నుండి ప్రాణనష్టం జరుగకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు రేయింబవళ్ల శ్రమించి ప్రజలకు కాపాడటం, వారికి కావలసిన నిత్యావసరాలను డ్రోన్లు, హెలిక్యాప్టర్ల ద్వారా చేరవేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు బోట్ల సహాయంతో తరలిస్తుంటే, విజయవాడ వరద ప్రాంతానికి వచ్చిన జగన్మోహన్రెడ్డి చంద్రబాబు గారిపై విమర్శలు చేసి మీడియాకు ఫోజులిచ్చి, ఫోటోలు తీయించుకొని 10 నిముషాలలో వరద ప్రాంతం నుండి వెళ్లిపోయిన జగన్కు, బాదితుల పట్ల చిత్తశుద్ది ఉంటే తాను అధికారంలో ఉండి దోచేసిన ప్రజాదనంలో 100 కోట్ల రూపాయలు తుఫాన్ బాదిత సహాయనిధికి తక్షణమే అందజేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ రోజు పత్రికల వారితో మాట్లాడుతూ ఒక పక్క వరద ప్రాంతాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు క్షణం తీరికలేకుండా, ఆలస్యం చేయకుండా లోతట్టు ప్రాంతాల




ప్రజలదగ్గరకు వెళ్లారు. వారికి మనోధైర్యాన్ని ఇవ్వడం జరిగింది. ఇప్పటి వరకు చంద్రబాబునాయుడు గారు విపత్తుల సమయంలో చేసిన కృషి దేశంలో ఎ ఒక్కరు తప్పుపట్టలేదు, నిన్న జగన్ చేసిన విమర్శలను బట్టిచూస్తే ప్రకాశం బ్యారేజ్లో గేట్లలోకి పడవలు కొట్టుకొని రావడంలోను, బుడమేరు గండి పడటం వెనుక జగన్ హస్తముందేమోనన్న అనుమానం కలుగుతుందనీ, దీనికి తోడు కొంతమంది వై.సి.పి. అరాచకశక్తులను పడవల ద్వారా పంపి దోపిడికి కూడా జగన్ కుట్రలు చేస్తున్నారన్న అనుమానం ఉంది. కనుక విజయవాడ ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలనీ, ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని కాపాడుతున్న చంద్రబాబు గారిపై అసందర్భోచిత వ్యాఖ్యలు చేస్తు ఒక పిచ్చివాడిలా ప్రవర్తిస్తున్న జనగన్ ఒక మ్యాడామ్యాన్ అని అతనిని వెంటనే మీ దగ్గరకు వస్తే పిచ్చాసుపత్రికి తీసుకొని వెళ్లి చేర్పించాలని సూచిస్తున్నాను. ఆపదలో ఉన్న ప్రజలను రెచ్చగొట్టేల మాట్లాడినటువంటి ఇలాంటి పిచ్చివాడిని రాళ్లతో కొడతారో, చెప్పులతో కొడతారో మీరే నిర్ణయించుకొని బుద్ధి చెప్పండి.అధికారంలో ఉండగా ఏనాడు ప్రజల మధ్యకురాని, పరదాల చాటున ఉండి, ప్యాలెస్కో పరిమితమైన నీకు ప్రజలను కన్నబిడ్డల్లా కాపాడుకుంటూ, అనుక్షణం ప్రజల మధ్యన గడుపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు గారి పేరు ఉచ్చరించే అర్హత లేదనీ హెచ్చరిస్తున్నా. ఒక పక్క ప్రజలను కాపాడుకుంటూ, సహాయక చర్యలను ముమ్మరం చేస్తున్న చంద్రబాబు గారిపై బురదజల్లే ప్రయత్నం చేసి, ప్రజల దృష్టిని మరల్చాలని కుట్రలు చేస్తున్న జగన్ ప్రజలు నిన్ను ఓడించినా నీ పిచ్చి ప్రవర్తనలో ఇంకా మార్పురాలేదని తేటతెల్లమైంది. వై.సి.పి. వారికి ఒకటే సూచిస్తున్నా ఇలాంటి పిచ్చివాడి నాయకత్వంలో ఉంటే మీరు కూడా ప్రజలలో చులకనైపోతారు కనుక వెంటనే మరో మార్గం చూసుకొండి. జగన్ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారికి ఒకటే విన్నపము. ఈ దుర్మార్గుడు జగన్ ఎంతటి నీచానికైనా దిగజారుతాడు సొంత చిన్నాన్ననే హత్యచేయించాడు. కనుక వెంటనే బుడమేరు, ఇతర పరివాహక నధులకు బందోబస్తు - గస్తీనీ ఏర్పాటు చేయాలనీ విజ్ఞప్తిచేస్తున్నానన్నారు.

## రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో బంగారు సాధించిన సేక్ ఫర్వతులను అభినందించిన ఎస్పీ




నంద్యాల సెప్టెంబర్ 3 విభారె న్యూస్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో బంగారు పతకం సాధించిన షేక్ ఫర్వాతుల్లా ను అభినందించిన జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఐపిఎస్ ఆగస్టు 31 మరియు సెప్టెంబర్ 1వ తేదీలలో తిరుపతిలోని సంస్కృత సెంట్రల్ యూనివర్సిటీ ఆవరణంలో జరిగినటువంటి రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీలలో భాగంగా నంద్యాల త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నటువంటి షేక్ ఫర్వాతుల్లా బంగారు పతకం సాధించడం జరిగింది. బంగారు పతకం సాధించడం తోపాటు వచ్చే నెల 17నుండి 20వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరగబోవు జాతీయస్థాయి తైక్వాండో పోటీలలో పాల్గొంటారు. జాతీయ స్థాయి పోటీలలో పధకాలు సాధించి రాష్ట్రానికి మరియు జిల్లాకి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని జిల్లా ఎస్పీ తెలియజేశారు. బంగారు పథకం సాధించిన క్రీడాకారు డిని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఐపిఎస్ మరియు త్రీ టౌన్ సీఐ అభినందించారు. ఈ కార్యక్రమంలో త్రీ టౌన్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు

# విమానాశ్రయ అభివృద్ధికి చర్యలు

**విద్యార్థుల సంరక్షణ విషయంలో నిర్లక్ష్యం వద్దు - ఎస్సీ బీసీ సంక్షేమ శాఖల డిడి కుష్బూ కొఠారి**



అనంతపురం విభారె న్యూస్ : సాంఘిక సంక్షేమ శాఖ మరియు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖల వసతి గృహ సంక్షేమ అధికారులు మరియు అన్ని విభాగాల సహాయ సంక్షేమ అధికారులతో శ్రీమతి కుష్బూ కొఠారి గారు, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమము మరియు సాధికారత అధికారి (పూ.అ.బా) మరియు వెనుకబడిన తరగతుల సంక్షేమము మరియు సాధికారత అధికారి, అనంతపురం వారు ముఖ్య ప్రణాళిక అధికారి వారి సమావేశం మందిరం నందు ఇరు శాఖలకు సంయుక్తముగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా శ్రీమతి కుష్బూ కొఠారి గారు మాట్లాడుతూ, బాల్యవివాహాల అరికట్టడానికి, మత్తు పదార్థాల సేవనమును నిషేధించవలసినదిగా తెలియజేయునటువంటి గోడపత్రికలను వసతి గృహాల గోడలకు అతికించవలెనని సూచించారు. అంతేకాకుండా ఈ వర్షాకాలం విద్యార్థుల సంరక్షణకు సంబంధించి ప్రత్యేకమైనటువంటి శ్రద్ధ చూపాలని, ఎప్పటికప్పుడు స్థానికంగా ఉన్నటువంటి ప్రాథమిక వైద్య కేంద్రాలలోని డాక్టర్లను సంప్రదించి వారి ఆరోగ్య పరిస్థితిని గమనించాలని సూచించారు. ఈ విషయమై ఇదివరకే జిల్లా ప్రధాన కార్యాలయం నుండి జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి అనంతపురం వారికి సంక్షేమ వసతి గృహాలలో మెడికల్ క్యాంపులు నిర్వహణ కొరకు లేక పంపడం జరిగినదని పేర్కొన్నారు. అనారోగ్యం బారిన పడినటువంటి విద్యార్థుల యొక్క వివరాలను నమోదు చేయడానికి ఒక ప్రత్యేకమైనటువంటి రిజిస్టర్ను రూపొందించి అందులో వారు సేవిస్తున్నటువంటి టాబ్లెట్స్ వివరాలను కూడా అందు పొందుపరచవలనని తెలియజేసినారు. వసతి గృహంలో పనిచేస్తున్నటువంటి సిబ్బంది వివరాలు మరియు విభాగాధిపతి పేరు, ఫోన్ నెంబర్ మరియు జిల్లా అధికారి యొక్క వివరములు ఒక నోటీసు బోర్డు నందు రాసి ఉంచాలని పేర్కొన్నారు. వసతి గృహంలోని విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలిగి తల్లిదండ్రులకు దూరంగా ఉన్నామనేటువంటి భావనను వారిలో దూరం చేయాలని సూచించారు. ప్రతిరోజు స్టడీ అవర్స్ నిర్వహించాలని, విద్యార్థులను చరవాణి వాడకానికి దూరంగా ఉంచాలని, మొబైల్ ఫోన్ వాడటం వల్ల కలిగే ఎటువంటి దుష్ప్రభావాలు దుష్పరిణామాల గురించి వారికి విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. క్రమశిక్షణ సమయపాలన వారిలో అలవాడేలా వారిని తీర్చిదిద్ది వారిని సరైన నడవడిక అలవర్చుకునేలా తయారు చేయాలని సూచించారు. అంతేకాకుండా వసతి గృహాలలోని విద్యార్థుల యొక్క భౌతిక హాజరు మరియు బయోమెట్రిక్ అటెండెన్స్ రెండింటి మధ్య తేడాలు ఉండకూడదని తెలిపారు. రోజువారి క్రమం తప్పకుండా తరగతులకు హాజరైతే వారికి కలిగేటువంటి విషయపరిజ్ఞానం వలన ఉండేటువంటి లాభాల గురించి ఉన్నత విద్య అభ్యసించేటప్పుడు దాని ఉపయోగాలు గురించి సవివరంగా వారికి తెలియజేయవలసిందిగా సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్స్ తో, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో నెలలో ఒకరోజు కలిసి విద్యార్థుల యొక్క విజ్ఞాన సముపార్జనకు సంబంధించినటువంటి పురోగతి ఏ విధముగా ఉన్నది అను విషయం ఆరా తీయవలసినదిగా సూచించారు. వసతి గృహాలలోని అల్లరి పిల్లలకు చక్రవర్తన కలిగే విధంగా అన్ని చర్యలు తీసుకొని ఇతర విద్యార్థులకు వారి నుండి ఇబ్బందులు ఎదుర్కొనకుండా చూసుకోవాలని అన్ని చర్యలు తీసుకున్నప్పటికీ అటువంటి విద్యార్థులు వసతి గృహంలో అలజడి సృష్టించిన యెడల అట్టి వారిని కొనసాగినవ్వకూడదు అని పేర్కొన్నారు. వసతి గృహాలలో పచ్చదనాన్ని పెంపొందించాలని మొక్కలు నాటాలని సూచించారు. విద్యార్థులకు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసే విషయమై అన్ని వసతి గృహాలలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపినారు. జిల్లాలోని అన్ని విభాగాల సహాయ సంక్షేమ అధికారులు వసతి గృహాలను తనిఖీ చేసినప్పుడు అన్ని విషయాలను ప్రస్ఫుటంగా గమనించి పరిశీలించి ఇందుకు సంబంధించినటువంటి వారి అభిప్రాయాన్ని నివేదిక నందు పొందుపరచాలని సూచించారు. ఏదైనా వసతి గృహంలో నీటికి సంబంధించినటువంటి సమస్య ఎదురైనా ఎడల వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వస్తే సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులను సంప్రదించి వెంటనే నీటి సమస్యను పరిష్కరించగలమని తెలిపినారు. ఈ వర్షాకాలంలో దోమల వ్యాప్తి జరగకుండా ఉండాలంటే అప్పుడప్పుడు మున్సిపాలిటీ సిబ్బంది చేత దోమల పొగ వేయించాలని సూచించారు. వసతి గృహాలలో ఫిర్యాదు పెట్టెలని ఏర్పాటు చేయాలని తెలిపినారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసే సమావేశానికి పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కూడా ఆహ్వానించవలసిందిగా సూచించారు. వసతి గృహాలలో చేయిస్తున్నటువంటి రిపేరీల తాలూకా అంచనా వ్యయం వివరాలు రికార్డులో ఉంచుకోవాలని సూచించారు. ఏ గది నందు ఏ విద్యార్థి నివసిస్తున్నాడో ఆ వివరాలు ఒక రిజిస్టర్ నందు పొందుపరచవలనని సూచించారు. రిపేరీల మునుపు తరువాత ఫోటోలను తీసి రికార్డు నిమిత్తం ఉంచాలని సూచించారు. ఔఅఅ, ఔూ మరియు సేవాదళ్ ప్రతినిధులతో వసతి గృహ విద్యార్థులకు ఔఅూఖీఆ, బాల్య వివాహాల నిర్మూలన వంటి అంశాల పై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రత్యేక శిక్షణ వసతి గృహాలలో ట్యూటర్ల ఏర్పాటుకు సంబంధించినటువంటి ప్రతిపాదనలను వెంటనే ప్రధాన కార్యాలయమునకు పంపవలసిందిగా సూచించారు. ఉపకార వేతనముల మంజూరు కు సంబంధించి పెండింగ్ లో ఉన్న సంయుక్త ఖాతాల కన్ఫర్మేషన్, ఔఖఅఏ లింక్, విద్యార్థుల హాజరు నమోదు వంటి అంశాలు ప్రిన్సిపాల్ తో చర్చించి సంబంధిత సంక్షేమ శాఖల ప్రధాన కార్యాలయాలకు దరఖాస్తులను పంపించే విధంగా అనుచరులు చేపట్టవలసినదిగా కోరవలెను అని సూచించడం జరిగినది. స్థానికంగా ఉన్నటువంటి దాతలను సంప్రదించి వసతి గృహములోని మౌలిక సదుపాయాల కల్పనకు మరియు ఆర్వో ప్లాంట్ వంటివి స్థాపన కొరకు వారి యొక్క సహాయ సహకారాలను కోరవలసిందిగా సూచించడం జరిగింది. విద్యార్థులకు యోగాభ్యాసము, ఆదివారాలు ఆటవిడుపు కొరకు వినోదాత్మకమైనటువంటి కార్యక్రమాలను, క్విజ్ కాంపిటీషన్లు నిర్వహణ మరియు వ్యక్తిత్వ వికాస పెంపుదల అంశాలపై దృష్టి సారించవలెనని సూచించడం జరిగినది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190